క్లుప్తంగా

ఘనంగా అద్దేపల్లి జయంతి



అద్దేపల్లి సత్యనారాయణమూర్తి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: క్షీరపురికి మంచి వన్నె తెచ్చిన విద్యావేత్త, దార్శనికుడు, విద్యాదాత స్వర్గీయ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి సేవలు మరువలేనివని కళాశాల ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కళాశాల దాత అద్దేపల్లి సత్యనారాయణమూర్తి 123 వ జయంతి కార్యక్రమం ఏఎస్ఎన్ఎం డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే డిగ్రీ కళాశాలలో వాసవి క్లబ్ డైమండ్ ఆధ్వర్యంలో మాజీ శాసన సభ్యులు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి అద్దేపల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి రాజరాజేశ్వరి, అద్దేపల్లి మోహన్‌దాస్, అద్దాల వాసుదేవరావు, గాదె సుబ్బారావు, సిహెచ్ రామకృష్ణ, పలివెల భాస్కర్, రేపాక మహేష్, వన్నెంశెట్టి నందు, నంబూరి పుల్లయ్య, పి నాగరాజు పాల్గొన్నారు.

పాలకొల్లులో విజిలెన్స్ అధికారుల తనిఖీ



ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు కోసం రికార్డులు పరిశీలిస్తున్నామని విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ సెక్షన్లు, రికార్డులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ ఆసుపత్రిలో కావాల్సిన ల్యాబ్‌తో సహా ఇతర అవసరాలు ఏం కావాలో? వాటిని మెరుగుపరచడానికి అవసరమైన వివరాలు తెలుసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రూపేష్ వర్మ, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్ బాబు, నరసాపురం డివిజన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆలీ, ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభాకరరావు, ఆసుపత్రి కమిటీ సభ్యులు చెన్ను విజయ్ పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన



కాళీపట్నం పడమరలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మొగల్తూరు: కాళీపట్నం పడమర గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శుక్రవారం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలించారు. చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన సమయంలో రహదారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన చీఫ్‌విప్ ప్రసాదరాజు రూ.20లక్షలు మంజూరు చేశారు. దీంతో గ్రామంలోని పల్లిపాలెం నుండి కృష్ణాజిల్లా గొల్లపాలెం వెళ్లే రహదారి వరకు సీసీ రోడ్డు నిర్మిస్తుండటంతో సొసైటీ చైర్మన్ దొంగ నాగముని, పార్టీ నాయకులు కవురు ఆదినారాయణ, కవురు సుబ్రమణ్యం,జక్కంశెట్టి ఏడు కొండలు, కవురు ఏడు కొండలు, కవురు సత్యనారాయణ తదితరులు రహదారి పనులు పర్యవేక్షించారు.

బీసీ మహాసభ కన్వీనర్‌గా చింతపల్లి రాధాకృష్ణ



నియామక పత్రం అందుకున్న అల్లాడ సూర్యభాస్కరరావు

పోడూరు: జాతీయ బీసీ మహాసభ పాలకొల్లు నియోజకవర్గ కన్వీనర్‌గా జిన్నూరు గ్రామానికి చెందిన బీసీ నాయకుడు చింతపల్లి రాధాకృష్ణ నియామకమయ్యారు. జిన్నూరులో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు అల్లాడ సూర్యభాస్కరరావు రాధాకృష్ణకు నియామక పత్రం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల సమస్యలు పరిష్కారానికి క్షేత్రస్థాయిలో కృషి చేయడమే జాతీయ బీసీ మహాసభ లక్ష్యమన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

వీరవాసరం: మండలానికి చెందిన చెన్ను దుర్గాప్రవీణ్ కనిపించడం లేదని తల్లి చెన్ను శారదా లక్ష్మి ఫిర్యాదు చేశారని ఎస్సై పి.రమేష్ తెలిపారు. గత కొన్ని రోజులుగా మానసిక ఒత్తిడితో బాధపడుతున్నాడని, ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ పొందుతున్నాడని తెలిపారు. పక్కంటి వారితో జరిగిన గొడవ కారణంగా అలిగి 5న వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ముమ్మరంగా శ్మశానవాటిక అభివృద్ధి పనులు

- రూ 1.98 కోట్లుతో గోదావరిగట్టున నిర్మాణం
- అధునాతన సౌకర్యాల ఏర్పాటు



వేగంగా సాగుతున్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు

నరసాపురం: గోదావరిగట్టున కొండాలమ్మగుడి సమీపంలో ఉన్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ 1.98 కోట్లుతో అధునాతన సౌకర్యాలతో శ్మశానవాటిక నిర్మాణం చేస్తున్నారు. పట్టణంలో ప్రధానమైన ఈ శ్మశానవాటిక గతకొంత లంగా అధ్వానంగా తయారైంది. గత మున్సిపల్ పాలకవర్గాలు ఈ సమస్యపై పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. చుట్టూ చెత్త, దుర్గంధంతో ఖననం చేయడానికి వచ్చే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కూర్చోవడానికి షెడ్డుగానీ, దహన సంస్కారాలకు ఏర్పాట్లు కానీ, స్నానాలు చేయడానికి సౌకర్యాలు లేవు. ఇక వర్షం వస్తే పరిస్థితి దారుణం. శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు మార్గం కూడా పాడైంది.

రూ 1.98 కోట్లుతో నిర్మాణం..

ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు చొరవతో శ్మశాన వాటికను స్మృతి వనంగా అభివృద్ధి చేయడానికి నిర్ణయించి మూడు నెలల క్రితం పనులు మొదలు పెట్టారు. దహనసంస్కారాలు కోసం గ్యాస్‌తో మండే చితిని, పక్కన పుల్లలతో కాల్చే చితిని వేర్వేరుగా నిర్మిస్తున్నారు. రెండు షెడ్డులు, చుట్టూ ప్రహరీ గోడ, గోదావరి వద్ద ప్రత్యేకంగా స్నానాల రేవు నిర్మిస్తున్నారు. శ్మశానవాటికకు వచ్చే రోడ్డును నిర్మిస్తున్నారు. పక్కనే ఉన్న స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసి అందులో దహన సంస్కారాలకు వచ్చేవారు కూర్చోవడాని సిట్టింగ్, అలాగే మంచి నీటి సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో పూలమొక్కలు, చెట్లు వేసి అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. వీటికి సంబంధిచి పనులు వేగంగా సాగుతున్నాయి.

ఇబ్బందులు లేకుండా నిర్మాణం



హిందూ శ్మశాన వాటికను రూ 1.98 కోట్లుతో అభివృద్ధి చేస్తున్నాము. దాదాపు 60 శాతం పనులు పూర్తయ్యాయి. దహన సంస్కారం కోసం గ్యాస్ ఆధారిత యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. పక్కన అన్ని వసతులతో పార్కును అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. చుట్టూ ప్రహరీ కూడా నిర్మిస్తున్నాం. వర్షాకాలం నాటికి పనులు పూర్తవుతాయి. దాతల సహకారంతో మహాప్రస్థానం వ్యాన్ కూడా ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నాం.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

ఏపీలో బీఆర్ఎస్ పోటీ అందుకే..

- మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య

పాలకొల్లు సెంట్రల్: కేసీఆర్ తన ఆప్తమిత్రుడైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్‌లో సహాయం చేయడానికే బీఆర్ఎస్ పార్టీని ఇక్కడ ఏర్పాటుచేస్తున్నారని మాజీ ఎంపీ, కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్య సందేహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పాలకొల్లులో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీలో బీఆర్ఎస్ పార్టీని స్థాపించి అధ్యక్షుడిగా కాపు కులస్తుడైన తోట చంద్రశేఖరరావును నియమించి వారి ద్వారా కాపు ఓటర్లను చీల్చి జనసేనకు నష్టం కలిగించడం, బీఆర్ఎస్ అధినేత వెలమ కులస్తుడు కాబట్టి ఉత్తరాంధ్రలో మెండుగా ఉన్న బీసీ, వెలమ ఓటర్లను ఆకట్టుకోవడం ద్వారా టీడీపీని దెబ్బతీసి వైఎస్సార్‌సీపీకి లబ్ధి చేకూర్చడం, వైఎస్సార్‌సీపీ వ్యతిరేక ఓట్లు ప్రతిపక్ష పార్టీలకు కలవకుండా బీఆర్ఎస్ పార్టీకి వేయించే ప్రయత్నంలో భాగంగా తోట చంద్రశేఖరరావును బీఆర్ఎస్‌కు అధ్యక్షుడిని చేశారని పేర్కొన్నారు. ఏపీకి బద్ధశత్రువైన కేసీఆర్ తెలంగాణలో తన బతుకేదో బతకడం మంచిదని సలహా ఇస్తున్నానని ఆ ప్రకటనలో జోగయ్య తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న అధికారులు

పాలకొల్లు సెంట్రల్: బీఆర్ఎంవీఎం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన బియ్యం పాఠశాల హెచ్ఎం ఝాన్సీలక్ష్మీబాయ్ నిర్లక్ష్యం వల్ల నాణ్యత లోపించాయని మిడ్ డే మీల్స్ జిల్లా కో ఆర్డినేటర్ కె.కృష్ణారావు తెలిపారు. శుక్రవారం పాఠశాల అభివృద్ధి కమిటీ నుంచి అందిన ఫిర్యాదు మేరకు కృష్ణారావు, తహసీల్దార్ జి.మమ్మి, ఎంఈఓ పుష్పరాజ్యంతో కలిసి పాఠశాలల మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే హెచ్ఎం అవగాహనా లోపం వల్ల యాప్‌లో తప్పుగా స్టాక్ వివరాలు ఇవ్వడం వల్ల స్టాక్ ఎక్కువ వచ్చి బియ్యం నాణ్యత లోపించిందని చెప్పారు. అనంతరం తహసీల్దార్ జి.మమ్మి మాట్లాడుతూ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టిలో పెట్టి బియ్యం మార్చడానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. అధికారుల వెంట పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కెల్లా పెద్దిరాజు, సభ్యులు ఊటుకూరి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు



అగ్రికల్చర్ సిబ్బంది శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు

పెనుమంట్ర: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా రైతాంగాన్ని సమాయత్తం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థలో మార్టేరు సబ్ డివిజన్ పరిధిలోని గ్రామీణ వ్యవసాయ అధికారులకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బంది రైతులకు ఎప్పటికప్పుడు పొలం బడులు నిర్వహించడం ద్వారా వారికి విలువైన సూచనలు అందించాలన్నారు. రైతులకు తమ సాగు వివరాలను తెలియజేస్తూ నిర్మాణాత్మక నిష్ణాతుడ్ని చేయాలన్నారు. ఈ సందర్భంగా పొలం బడిలో సుస్థిర వ్యవసాయంతో పాటు సేంద్రియ వ్యవసాయం, సమగ్ర పంట యాజమాన్యంపై వీఏఏలకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ వైఎస్సార్ పొలం బడి ట్రైనీగా కె.పార్థసారధి, జిల్లావనరుల కేంద్రం ఏటీవో కాళీమాత, పరిశోధనస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఏవీఎల్ ఆనంద్ పాల్గొన్నారు.

పుష్పరాజుకు ఫెలోషిప్ అవార్డు



నన్నేటి పుష్పరాజ్

పెనుగొండ: మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడుకు నన్నేటి పుష్పరాజ్ అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు నన్నేటి పుష్పరాజ్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బుద్ధ ప్రచార ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 8న ఏలూరు రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ఎస్సీ కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, ఏసీపీ మోకా సత్తిబాబులు హాజరవుతారని తెలిపారు. పుష్పరాజ్‌కు అవార్డు ప్రకటించడంపై మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా లక్ష తులసి పూజ



లక్ష తులసి పూజ చేస్తున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం లక్ష తులసి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం పూజలు పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు గోపూజ, గ్రామోత్సవం, విశ్వక్సేణ పూజ, పుణ్యాహవచనం, పంచామృత మండపారాధన, మూలవరులకు అభిషేకం, అలంకరణ అనంతరం స్వామి వారికి లక్ష తులసి పూజ, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ పునర్నిర్మాణ దాతలు గుణ్ణం నారాయణరావు, సుజయశ్రీ దంపతులతో పాటు మరికొంత మంది దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఆలయ అర్చకులు కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

11మంది పేకాట రాయళ్ల అరెస్టు

తణుకు: తణుకు పట్టణంలో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. స్థానిక ఒకటో వార్డు అభయాంజనేయ నగర్‌లో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో సీఐ ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ. 20,720 నగదు, పది సెల్ ఫోన్లు, అయిదు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేకాలంకరణ



ప్రత్యేకాలంకరణలో ఉల్లంపర్రు శ్రీ కనకదుర్గమ్మ

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు – మార్టేరు ఆర్అండ్‌బీ రోడ్డులో ఉల్లంపర్రులో వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మను ధనుర్మాసం సందర్భంగా శుక్రవారం వివిధ రకాల ఫలాలతో ప్రత్యేకంగా అలంకరించారు. యాపిల్, కమలాలు, నారింజ, బత్తాయి, దానమ్మ, పుచ్చకాయలు, కర్బూజ, డ్రాగన్ ఫ్రూట్, చెరకు గడలు, అరటిపండ్లు తదితర పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని ఉల్లంపర్రు, పార్వతీ నగర్, బ్రాడీపేట, జిన్నూరు తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దాల వాసు ఆధ్వర్యంలో అర్చకస్వామి బాదంపూడి సాంబమూర్తి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు.

పాదయాత్ర రిజిస్ట్రేషన్ ప్రారంభం...

భీమవరం మావుళ్లమ్మను దర్శించుకునే నిమిత్తం ఈ నెల 8వ తేదీ ఆదివారం ఉదయం 6:20 గంటలకు ఉల్లంపర్రు నుంచి ప్రారంభం కానున్న పాదయాత్రకు శుక్రవారం ఉదయం అమ్మవారి ఆలయం వద్ద రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. సుమారు 84 మంది భక్తులు పాదయాత్రకు వెళ్లడానికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు మద్దాల వాసు తెలిపారు.

చర్చి స్థలంపై వివాదం

యలమంచిలి: మండలంలోని కొంతేరు పంచాయతీ బత్తులవానిపేటలో ఉన్న జీడీఎం చర్చికి అనుకుని ఉన్న పంటబోదె పక్కన ఉన్న స్థలంపై వివాదం నెలకొంది. బోదె గట్టు స్థలం మీదుగా దారిని ఏర్పాటు చేయాలని ఓ రైతు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు విచారణకు వెళ్లగా జీడీఎం చర్చి సంఘస్తులు అడ్డుకున్నారు. అయితే తమకు నోటీసులు ఇవ్వకుండా విచారణకు రావడం ఏంటని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు రైతుకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇది ఇలా ఉండగా విచారణకు వెళ్లిన తనపై సంఘస్తులు దాడి చేశారని వీఆర్ఏ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

పోస్టాఫీస్ సేవలను వినియోగించుకోవాలి

అత్తిలి: ఈనెల 18 వరకు భారత తపాలాశాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అధిక మొత్తంలో పొదుపు చేసుకోవాలని సీహెచ్‌వీ సుబ్బారావు తెలిపారు. కేంద్రం వడ్డీ రేట్లను మార్చి నెలాఖరు వరకు పెంచిన కారణంగా ప్రజలు పోస్టాఫీస్‌లో పొదుపు చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. 10 ఏళ్లలోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి ఖాతాను ప్రారంభించుకోవచ్చన్నారు. గతంలో సుకన్య అకౌంట్ తీసుకున్నవారు, ఒక వాయిదా మాత్రమే కట్టినవారు తమ పాస్‌బుక్ తీసుకుని మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పోస్టాఫీస్‌లో పరిశీలన చేసుకోవాలని కోరారు. తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలను తక్కువ ప్రీమియంతో అధిక బోనస్‌ను పాలసీదారులకు అందజేస్తోందని చెప్పారు. సంక్రాంతి సంబరాల్లో తపాలాశాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సుబ్బారావు కోరారు.

వృద్ధుల కష్టాలను స్వయంగా చూసిన వ్యక్తి సీఎం జగన్



పాలకొల్లు వైసీపీ కార్యాలయ ఆవరణలో కొత్తగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు అందజేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్



పూలపల్లి సచివాలయం వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు



అడవిపాలెంలో సంతోషం వ్యక్తం చేస్తున్న నూతన పింఛన్ లబ్ధిదారులు



ఆచంట వేమవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చంటి, నాయకులు

పాలకొల్లు అర్బన్: పేద, మధ్య తరగతి వర్గాల్లో వృద్ధుల పడుతున్న కష్టాలను ప్రజాసంకల్ప యాత్రలో స్వయంగా చూసి ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతీ ఒక్కరికీ నిష్పక్షపాతంగా వైఎస్సార్ పింఛన్ కానుక అందిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ స్పష్టం చేశారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం పాలకొల్లు పట్టణ పరిధిలోని 31వార్డులకు చెందిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు కొత్తగా మంజూరైన పింఛన్లను శ్రీనివాస్ అందజేసి మాట్లాడారు. వయోభారంతో బాధపడుతున్న వృద్ధులకు పెద్ద కొడుకుగా నెలనెలా పింఛన్ డబ్బులను ఇళ్లకే పంపించి సంక్షేమ సూరీడుగా నిలిచారన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు పాల్గొన్నారు. అలాగే బల్లిపాడు, శివదేవునిచిక్కాల, దగ్గులూరు గ్రామాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొని కొత్తగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు.

అద్దేపల్లి సత్యనారాయణమూర్తికి ఘన నివాళి

పాలకొల్లు శ్రీ ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల ఏర్పాటుకు తన ఆస్తిని సైతం విక్రయించి గ్రామీణ ప్రజలకు విద్యాదానం చేసిన దాత అద్దేపల్లి సత్యనారాయణమూర్తి జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల ఏర్పాటుకు అద్దేపల్లి ఎంతో కృషి చేశారన్నారు. దాతృత్వానికి పాలకొల్లు వైశ్యులు ప్రముఖంగా నిలుస్తారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, దేవస్థానం చైర్మన్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు. అలాగే పూలపల్లిలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు కొత్తగా మంజూరైన పింఛన్లు అందజేశారు. వడ్లవానిపాలెంలో సర్పంచ్ పెన్మెత్స పద్మ పింఛన్లు అందజేశారు. దిగమర్రులో సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్, ఎంపీటీసీ పెదపాటి వెంకటరత్నం, ఉపసర్పంచ్ కొండేటి మల్లికార్జునరావు పింఛన్లను అందజేశారు. వరిధనం సచివాలయం వద్ద వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వర్ధనపు మోహన్‌రావు, సచివాలయ కన్వీనర్ కవురు శ్రీనివాస్, గంటా కుమారి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

పోడూరులో..

పోడూరు: పేదల సంక్షేమమే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీ చైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని 8 గ్రామాల్లో కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పింఛను సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. మండలంలో పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని 8 గ్రామాల్లో కొత్తగా 217 మందికి పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, జెడ్పీఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, వైస్‌ఎంపీపీ లు ఇందుకూరి సీతారామరాజు, గుబ్బల సత్యనారాయణ, మండల కన్వీనర్ కలిదిండి గణపతిరాజు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

అడవిపాలెంలో..

యలమంచిలి: అర్హతే ప్రామాణికంగా పారదర్శక పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ అడవిపాలెం గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడు తోట రామకృష్ణ అన్నారు. గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్ దారులకు శుక్రవారం సచివాలయ సిబ్బంది పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బుంగా జయరాజు, మహిళ అధ్యక్షురాలు గంజి వెంకటలక్ష్మి, కార్యదర్శి విస్సా సరస్వతి సచివాలయ కన్వీనర్లు ఖండవల్లి బాబూరావు, దొంగ సుబ్బారావు పాల్గొన్నారు.

పెనుగొండలో

పెనుగొండ: వృద్ధులకు సామాజిక భద్రత కల్పించడానికి ఇచ్చిన మాట మేరకు పింఛన్లు పెంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలిచారని ఆచంట వేమవరం సర్పంచ్ జక్కంశెట్టి చంటి అన్నారు. శుక్రవారం ఆచంట వేమవరంలో నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ పింఛన్లు అందించే విధంగా మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కే సురేష్ బాబు, సొసైటీ చైర్‌పర్సన్ వీర వీర భద్రం, గుడిమెట్ల రామలింగం, నాయకులు ఏడ్ల రామకృష్ణ, చల్లబోయిన శివ పార్వతి, వైట్ల రాంబాబు, విశ్వనాథుల అన్నపూర్ణ, కాండ్రేగుల స్వామి, కొండేటి జోగేంద్ర, మాండ్రు దివాకర్ పాల్గొన్నారు.